# 'కల్కి'లో కొత్త ప్రపంచాన్ని చూస్తారు




''కల్కి 2898 ఏడీ' చిత్రంలో భాగం కావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఇదొక అద్భుతమైన అనుభవం. ఈ సినిమా ద్వారా ఓ కొత్త ప్రపంచాన్ని చూస్తారు. ఇలాంటి సినిమాను గతంలో ఎప్పుడూ చేయలేదు' అన్నారు బిగ్‌బి అమితాబ్ బచ్చన్. బుధవారం ముంబయిలో 'కల్కి 2898 ఏడీ' ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో ప్రభాస్, కథానాయిక దీపికా పదుకోన్, కమల్‌హాసన్, చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వినిదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా అమితాబ్‌బచ్చన్ మాట్లాడుతూ 'నాగ్‌అశ్విన్ ఈ కథ చెప్పినప్పుడు చాలా ఆశ్చర్యపోయాను. ఇందులో ఉన్న విజువల్స్ మరో స్థాయిలో ఉంటాయి. ఈ సినిమా ఎక్స్‌పీరియన్స్‌ను ఎప్పటికీ మర్చిపోలేను' అన్నారు. కమల్‌హాసన్ మాట్లాడుతూ 'దర్శకుడు నాగ్‌అశ్విన్ మా గురువు బాలచందర్‌గారిలా ఆర్డీనరీగా కనిపించే ఎక్స్‌ట్రార్డీనరీ మ్యాన్. తన ఐడియాను తెరపైకి అద్భుతంగా తీసుకొచ్చాడు. ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రను పోషించాను. నా పాత్ర సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది' అని చెప్పారు. ప్రభాస్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ వంటి గ్రేటెస్ట్ లెజెండ్స్‌తో కలిసి పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. కమల్‌హాసన్‌గారు నటించిన 'సాగర సంగమం' చూసి అలాంటి డ్రెస్ కావాలని మా అమ్మను అడిగాను. 'ఇంద్రుడు చంద్రుడు' సినిమా చూసి ఆయనలా యాక్టింగ్ చేసేందుకు ప్రయత్నించే వాడిని. అలాగే దీపికా పదుకోన్ వంటి ఇంటర్నేషనల్ స్టార్‌తో పనిచేయడం మరపురాని అనుభూతినిచ్చింది' అన్నారు. ఈ సినిమా ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని, దర్శకుడు నాగ్‌అశ్విన్ తెరపై మ్యాజిక్ క్రియేట్ చేశారని దీపికా పదుకోన్ చెప్పింది. అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్ వంటి అగ్ర తారల సమక్షంలో ఈ వేడుకను జరుపుకోవడం ఆనందంగా ఉందని నిర్మాత అశ్వినిదత్ అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# ఆ విషయంలో తగ్గేదేలే!



**ఒకప్పుడు** తెలుగు అగ్ర కథానాయికల్లో ఒకరిగా చెలామణి అయ్యింది మంగళూరు సోయగం పూజా హెగ్డే. వరుసగా భారీ చిత్రాల్లో అవకాశాలు సంపాదించుకొని సత్తా చాటింది. అయితే గత కొంతకాలగా ఈ భామకు అదృష్టం కలిసి రావడం లేదు. తెలుగు, హిందీ భాషల్లో ఆమె నటించిన చిత్రాలు పరాజయం పాలవడంతో రేసులో పూర్తిగా వెనకబడింది. అయితే తమిళంలో ఇటీవలే సూర్య చిత్రంలో అవకాశాన్ని దక్కించుకొని అందరిని ఆశ్చర్యపరిచింది. ఈ సినిమా తనకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తుందనే ఆశాభావంతో ఉంది పూజాహెగ్డే. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో పీరియాడిక్ డ్రామాగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా కోసం పూజాహెగ్డే రెమ్యునరేషన్‌ను పెంచినట్లు తెలిసింది. గతంలో ఒక్కో సినిమాకు మూడు కోట్ల రెమ్యునరేషన్ అందుకుంది పూజాహెగ్డే. అయితే సూర్య సినిమాకు మాత్రం నాలుగు కోట్లకు పైగా ఛార్జ్ చేస్తున్నదని తెలిసింది. పీరియాడిక్ కథతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కథానాయిక పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని, డేట్స్ కూడా పెద్ద మొత్తంలో కేటాయించాల్సి రావడంతో పూజాహెగ్డే రెమ్యునరేషన్ పెంచిందని అంటున్నారు. అవకాశాలు తగ్గిపోయినా పారితోషికం విషయంలో ఏమాత్రం తగ్గేదేలేదన్నది పూజాహెగ్డే నిర్ణయమని ఆమె సన్నిహితులు అంటున్నారు. ఈ చిత్రాన్ని కార్తీక్ సుబ్బరాజ్, కల్యాణ్ సుబ్రమణియం, సూర్య, జ్యోతిక నిర్మిస్తున్నారు. త్వరలో టైటిల్‌ను ప్రకటించబోతున్నారు.



# ఆగస్ట్‌లో రంగంలోకి..

రామ్‌చరణ్ కథానాయకుడిగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో పాన్ ఇండియా చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిదే. జాన్వీకపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఏ.ఆర్.రెహమాన్ స్వరకర్త. కొద్ది మాసాల క్రితం ఈ చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఉత్తరాంధ్ర బ్యాక్‌డ్రాప్‌లో క్రీడా నేపథ్య కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. రామ్‌చరణ్ నటిస్తున్న 16వ చిత్రమిది. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ వెలువడింది. రెగ్యులర్ షూటింగ్‌ను ఆగస్ట్‌లో మొదలుపెట్టబోతున్నారని తెలిసింది. ప్రస్తుతం రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ మరికొద్ది రోజుల్లో పూర్తి కానుంది. అనంతరం బుచ్చిబాబు సినిమా కోసం రామ్‌చరణ్ సన్నద్ధం అవుతారని చెబుతున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రత్నవేలు, ఆర్ట్: అవినాష్ కొల్లా, పాటలు: చంద్రబోస్, అనంత శ్రీరామ్, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, దర్శకత్వం: బుచ్చిబాబు సానా.

# కోపం చాలు శ్రీమతిగారు



దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాలో 'శ్రీమతి గారు..' అనే తొలి గీతాన్ని బుధవారం విడుదల చేశారు. జీవీ ప్రకాష్ కుమార్ స్వరపరచిన ఈ మెలోడీ గీతం వినసొంపుగా సాగింది. శ్రీమణి సాహిత్యాన్నందించిన ఈ గీతాన్ని విశాల్ మిశ్రా, శ్వేతా మోహన్ ఆలపించారు. 'కోపాలు చాలండి శ్రీమతిగారు కొంచెం కూల్ అవ్వండి మేడం గారు' అంటూ కోపంతో అలిగిన భార్యను బుజ్జగిస్తూ భర్త పాడే ఈ పాట అందమైన భావాలతో సాగుతుందని చిత్ర బృందం పేర్కొంది. 1980-90 దశకంలో అసాధారణ విజయాలను సాధించిన ఓ బ్యాంక్ క్యాషియర్ నేపథ్య కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: నిమిష్ రవి, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, రచన-దర్శకత్వం: వెంకీ అట్లూరి.

# ప్రేమకు వేళయింది



దేశవ్యాప్తంగా మంచి పాపులారిటీ ఉన్న కథానాయికల్లో శ్రద్ధా కపూర్ ఒకరు. ఆషికీ-2, ఓకే జాను, చిచోరే, సాహో వంటి చిత్రాలతో ఆమె యువతరానికి బాగా చేరువైంది. ఆమె గత చిత్రం 'తూ జూతీ మై మక్కర్' కమర్షియల్‌గా మంచి విజయాన్ని సాధించింది. ప్రస్తుతం ఆమె 'స్త్రీ-2' చిత్రంలో నటిస్తున్నది. ఈ నేపథ్యంలో ఈ భామ సరికొత్త ప్రేమాయణం బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. 'తూ జూతీ మై మక్కర్' చిత్ర రచయితల్లో ఒకరైన రాహుల్ మోదీతో ఈ అమ్మడు ప్రేమలో పడిందని ప్రచారం జరుగుతున్నది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో రాహుల్ మోదీతో కలిసి ఉన్న ఓ ఫొటోను షేర్ చేసింది. ఇందులో రాహుల్ చేతిని పట్టుకొని నవ్వుతూ కనిపిస్తున్నది శ్రద్ధాకపూర్. ఈ ఫోటోకు స్మైలీ, లవ్ ఎమోజీలను జోడించింది. ఈ ఫొటో ద్వారా తన లవ్‌ఎఫైర్‌ను శ్రద్ధాకపూర్ అధికారికంగా ప్రకటించిందని అభిమానులు భావిస్తున్నారు. 'తూ జూతి మై మక్కర్' సినిమా సమయంలోనే వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం ఏర్పడిందని, అప్పటి నుంచి డేటింగ్‌లో ఉన్నారని వారి సన్నిహితులు అంటున్నారు.

# దుష్టశిక్షణలో శివం భజే



అశ్విన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'శివం భజే'. అప్సర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. బుధవారం టీజర్‌ను విడుదల చేశారు. హీరో అశ్విన్ ఏదో మానసిక సమస్యతో బాధపడుతున్నట్లు చూపించే సన్నివేశాలతో మొదలైన టీజర్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. కొన్ని అనూహ్య సంఘటనల వెనక దైవం ఉందని తెలియజేయడం, హీరో రౌద్ర రూపాన్ని ధరించి రౌడీలను అంతం చేయడం, చివరగా శివుడి దర్శనంతో టీజర్‌ను ఆసక్తికరంగా ముగించారు. యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలు కలబోసిన డివోషనల్ మూవీ ఇదని, గ్రాఫిక్స్ ప్రధానాకర్షణగా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులతో ఈ సినిమాను తెరకెక్కించామని, ప్రేక్షకులకు సరికొత్త విజువల్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుందని, జూలైలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత మహేశ్వర్ రెడ్డి మూలి తెలిపారు. సస్పెన్స్, థ్రిల్లర్, యాక్షన్, కామెడీ అంశాలు కలబోసిన పర్‌ఫెక్ట్ మూవీ ఇదని హీరో అశ్విన్ బాబు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: వికాస్ బడిస, ప్రొడక్షన్ డిజైనర్: సాహి సురేష్, దర్శకత్వం: అప్సర్.

# సందీప్‌కిషన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



**సందీప్‌కిషన్** 30వ చిత్రం రెగ్యులర్ షూటింగ్ బుధవారం హైదరాబాద్‌లో మొదలైంది. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మిస్తున్న ఈ చిత్రం కొద్ది రోజుల క్రితమే లాంఛనంగా ప్రారంభోత్సవం జరుపుకున్న విషయం తెలిసిందే. 'కుటుంబ అనుబంధాలు, ప్రేమ, కామెడీ అంశాల కలబోతగా తెరకెక్కిస్తున్న చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. సందీప్‌కిషన్‌ను మునుపెన్నడూ చూడని సరికొత్త పంథాలో ఆవిష్కరిస్తుంది. సంగీతానికి చాలా ప్రాధాన్యత ఉంటుంది. దర్శకుడు త్రినాథ రావు నక్కిన తనదైన శైలి అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: లియోన్ జేమ్స్, నిర్మాణ సంస్థ: ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్, కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు: ప్రసన్న కుమార్ బెజవాడ, దర్శకత్వం: త్రినాథ రావు నక్కిన.

# ఆర్కిటెక్ట్ నిత్య పాత్రలో



ఏజెంట్, గాండీవధారి అర్జున చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది సాక్షి వైద్య. ఆ సినిమాలు ఆశించిన ఫలితాలను సాధించలేకపోయినా ఈ భామ అభినయానికి మాత్రం మంచి మార్కులు పడ్డాయి. తాజాగా ఈ సొగసరి తెలుగులో మరో మంచి ఆఫర్‌ను సొంతం చేసుకుంది. వివరాల్లోకి వెళితే...ఇటీవలే 'మనమే' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చారు హీరో శర్వానంద్. ప్రస్తుతం ఆయన తన 37వ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మాత. తాజాగా ఈ చిత్రంలో కథానాయికగా సాక్షి వైద్యను ఖరారు చేశారు. బుధవారం ఆమె పుట్టినరోజును పురస్కరించుకొని కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో ఆమె ఆర్కిటెక్ట్ నిత్య పాత్రలో కనిపిస్తుందని, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుతున్నామని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కథ: భాను భోగవరపు, సహనిర్మాత: అజయ్ సుంకర, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రామ్ అబ్బరాజు.



# యథార్థ సంఘటనల ఆధారంగా

ప్రణవ్‌ప్రీతం, షాజ్ఞ శ్రీవేణున్ జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు'. శ్రీనాథ్ పులకురం దర్శకుడు. బ్లాక్ ఆంట్ పిక్చర్స్ పతాకంపై భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మిస్తున్నారు. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఓ యథార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ సినిమా కోసం ఆర్టిస్టులందరిని మా ఊరు పుంగనూరు తీసుకెళ్లి రాయలసీమ యాస నేర్పించాను. చిత్రీకరణ మొత్తం అదే ఊరిలో చేశాం. సహజమైన పాత్రలతో హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలతో ఈ సినిమా ఆకట్టుకుంటుంది' అన్నారు. పరిమిత బడ్జెట్‌లోనే అత్యుత్తమ క్వాలిటీతో ఈ సినిమా తీశామని, టీనేజ్ ప్రేమకథగా ప్రతి ఒక్కరిని మెప్పిస్తుందని నిర్మాత భువన్ రెడ్డి తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

# దెయ్యం పండించే వినోదం

వెన్నెల కిషోర్, నందితాశ్వేత, నవమి గాయక్, షకలక శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. శంకర్ మార్తాండ్ దర్శకుడు. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'హారర్ కామెడీ జోనర్ సినిమా ఇది. కుటుంబ సమేతంగా చూసే విధంగా ఉంటుంది. సాంకేతికంగా కూడా ఉన్నత ప్రమాణాలతో తెరకెక్కించాం. అనూప్ రూబెన్స్ సంగీతం ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అన్నారు. స్వతహాగా తనకు కామెడీ అంటే ఇష్టమని, ఈ సినిమాలో ఆద్యంతం నవ్వించే క్యారెక్టర్‌ను పోషించడం ఆనందంగా ఉందని కథానాయిక నందితా శ్వేత తెలిపింది. వెన్నెల కిషోర్, షకలక శంకర్ పండించిన కామెడీ హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాత డా|| అబినికా ఇనాబతుని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.






# ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'

**నవీన్‌చంద్ర హీరోగా** నటిస్తున్న తాజా చిత్రం 'లెవెన్'. లోకేష్ అజ్ల్స్ దర్శకత్వం వహిస్తున్నారు. అజ్మల్‌ఖాన్, రేయా హరి నిర్మాతలు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందిస్తున్న ఈ చిత్ర టీజర్‌ను హీరో నిఖిల్ ట్విట్టర్ ద్వారా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ 'ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కథాంశమిది. ఓ యూనిక్ పాయింట్‌తో తెరకెక్కించాం. పోలీస్ ఆఫీసర్‌గా నవీన్‌చంద్ర అద్భుతమైన పర్‌ఫార్మెన్స్ కనబరిచారు. ఆద్యంతం అనూహ్య మలుపులతో ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేస్తుంది' అన్నారు. కథ విన్న వెంటనే సినిమా చేయాలని ఫిక్సై పోయానని, ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ జోనర్‌లో ఇదొక కొత్త ప్రయత్నమని హీరో నవీన్‌చంద్ర తెలిపారు. తమిళ. తెలుగు భాషల్లో అద్భుతమైన క్వాలిటీతో ఈ సినిమాను తెరకెక్కించామని, త్వరలో థియేటర్లలో విడుదల చేస్తామని నిర్మాతలు పేర్కొన్నారు. రేయా హరి, శశాంక్, అభిరామి, దిలీపన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ అశోక్, సంగీతం: డి. ఇమ్మాన్, నిర్మాణ సంస్థ: ఏఆర్ ఎంటర్‌టైన్‌మెంట్, రచన-దర్శకత్వం: లోకేష్ అజ్ల్స్.